క్లుప్తంగా

పాఠశాలలో జ్ఞాన సరస్వతి పూజ



పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు జ్ఞాన సరస్వతిదేవి చిత్రపటం వద్ద హాల్ టికెట్లు ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు విద్యార్థులు పాదపూజలు చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు అరుణాకుమారి మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడు రాయబండి శేఖర్‌చారి, కోశాధికారి బొడ్డుపల్లి రమేశ్‌చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 ఏళ్ల పోరాట ఉద్యమం ఫలితంగా ఎస్సీ ఏబీసీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బుధవారం బడంగ్‌పేటలోని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట డప్పులు మోగిస్తూ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి మాట్లాడుతూ.. ఏళ్లుగా అలుపెరగని పోరాటం నిర్వహించి మాదిగలకు ఫలాలు అందజేసిన మందకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, అమ్రేశ్, యాదయ్య, ఎల్లన్న, నర్సింహ, రాము, ప్రభాకర్, బాలకృష్ణ, విజయ్‌కుమార్, ఇంద్ర, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం



రాములుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా పట్టణానికి చెందిన బసగళ్ల రాములుగౌడ్ ఇటీవల ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, నియోజకవర్గ నాయకుడు వైభవ్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాములుగౌడ్ బీజేపీలో ఎన్నో ఏళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారని, చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం కల్పించినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు వాసుదేవ్ కన్నా, నాయకులు ఇంద్రాసేనారెడ్డి, శ్రీకాంత్, పరమేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, జయసింహారెడ్డి, దండు రామ్మోహన్, నర్సింహ, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

షాద్‌నగర్: ఇల్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ సరితను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది నిరుపేదలు ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో గుడిసెల్లో నివాసం ఉంటున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలీ దినాలను రెండు వందల రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కూలీలు పని చేస్తున్న ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులకు సేఫ్టీ పరికరాలు, టెంట్లు, మంచినీటి వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మికులు ఉన్నారు.

సుందరీకరణ సరే..



బట్టేల్‌గుట్ట బురుజు

సందర్శన భాగ్యం ఏది?

- శిథిలావస్థ బురుజుకు సరికొత్త కళ
- రూ.2.50 కోట్లతో వారసత్వ సంపద అభివృద్ధి
- ఆహ్లాదకరమైన వాతావరణంలో నవాబుల కోట
- ఇరువైపులా ప్రధాన గేట్ల మూసివేత

బడంగ్‌పేట్: చరిత్రాత్మక బట్టేల్‌గుట్ట నిజాం నవాబుల కాలంలో బడా జంగ్‌పేట్‌లో(నేటి బడంగ్‌పేట్) యుద్ధ సైన్యాన్ని ఉంచేందుకు ఏర్పాటు చేశారు. శత్రువులు ఎవరైనా వస్తే తెలుసుకునేందుకు ఈ గుట్టపై పెద్ద బురుజును నిర్మించారు. కాలక్రమేనా బురుజు శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో.. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరమ్మతు చేయించాలని తీర్మానించారు. రూ. కోట్లు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. కానీ బురుజు అందాలను ఆస్వాదించేందుకు సామాన్యులను అనుమతించక పోవడంతో ప్రజలు విచారం వ్యక్తంచేస్తున్నారు.

రాజ ముద్రగా..

బురుజుకు కొత్తరూపం తెచ్చేందుకు కార్పొరేషన్ నుంచి దశల వారీగా నిధులు వెచ్చించారు. మొదట ప్రధాన గేటు ఏర్పాటు చేయగా.. ప్రజలకు, అధికారులకు వచ్చిపోయే వారికి తెలియ లేదు. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నుంచి గుట్ట పైకి వెళ్లేందుకు రహదారిని(ఇనుపమెట్లు) ఏర్పాటు చేశారు. మొత్తంగా గుట్ట సుందరీకరణ కోసం సుమారు రూ.2.50 కోట్లు వెచ్చించారు. ఘనంగా ప్రారంభించారు. ప్రస్తుతం బురుజు కార్పొరేషన్‌కు ఐకాన్‌గా కాదు.. రాజ ముద్రగా మారిపోయింది.

పెద్దవారికేనా అనుమతి?

కోట్లాది రూపాయలతో బట్టేల్‌గుట్ట బురుజును అభివృద్ధి చేశారు. గుట్ట మధ్యలో ధ్యాన ముద్రలో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. పచ్చికబయళ్లను ఏర్పాటు చేశారు. పార్కు పర్యవేక్షణకు కార్పొరేషన్ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. కానీ.. ఇంత చేసి సామాన్యులకు సందర్శన అవకాశం కల్పించపోవడంతో ప్రజలు నిరాశతో వెనుతిరుగుతున్నారు. లోపటికి ఎవరూ రాకుండా రెండువైపులా గేట్లను మూసివేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకే అనుమతి ఇస్తారా అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి.. సామాన్యులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరుతున్నారు.



మూసివేసిన కొత్త ఇనుప గేట్లు

“ సామాన్యులకు..



శిథిలావస్థకు చేరిన వారసత్వ సంపద బురుజుకు ఎట్టకేలకు కొత్తరూపం తెచ్చాం. నాటి గుర్తుగా నేటి తరాలకు పరిచయం చేసేందుకు తీర్చిదిద్దాం. అనుకున్నదానికంటే ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా దర్శనమిస్తోంది. సామాన్యులు ప్రశాంతంగా సేదతీరేలా, అధికారులతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటాం.

– సబితారెడ్డి, ఎమ్మెల్యే

లక్ష్యం చేరుకోవాలంటే.. తప్పదు

బడంగ్‌పేట్: వందశాతం ఇంటి పన్ను వసూలు లక్ష్యంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పరుగులు తీస్తున్నారు. 2025– 26 సంవత్సరానికి రూ.30 కోట్ల టార్గెట్ చేరుకునేలా చెమటోడుస్తున్నారు. ఇంటి పన్ను, కమర్షియల్ టాక్స్ చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇంటి యజమానులు, వ్యాపారులకు సంబంధించిన ఇళ్ల డ్రైనేజీలను మూసివేయిస్తున్నారు. నోటీసులు అందజేస్తున్నారు. దుకాణాలు తెరవకుండా చేస్తూ.. ముక్కుపిండి పన్ను వసూలు చేస్తున్నారు. ఇదే విషయమై అధికారులను వివరణ కోరగా.. కార్పొరేషన్ నుంచి అన్ని రకాల సేవలను పొందుతూ.. పన్ను కట్టకుండా కొందరు మొండికేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారి పట్ల కాస్త కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. లక్ష్యం చేరుకోవాలంటే ఇలాంటివి తప్పదని వివరించారు.



దుకాణం మూసివేయించి పన్ను వసూలు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామం

అప్పోజీగూడను విలీనం చేస్తూ బిల్లు పాస్ చేసిన ప్రభుత్వం

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీలో మరో గ్రామం విలీనమైంది. అప్పోజీగూడ గ్రామ పంచాయతీని విలీనం చేస్తూ బుధవారం ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. దీంతో మున్సిపాలిటీలో విలీనమైన గ్రామ పంచాయతీల సంఖ్య తొమ్మిదికి చేరగా.. మండలంలో మిగిలిన గ్రామ పంచాయతీల సంఖ్య 19కి తగ్గింది. గత జనవరి 27న ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 8 గ్రామ పంచాయతీలను కలిపి మొయినాబాద్ మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఇందులో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ముర్తూజగూడ గ్రామాలను చేర్చింది. అయితే అప్పట్లోనే అప్పోజీగూడ గ్రామస్తులు తమ పంచాయతీని సైతం మున్సిపాలిటీలో చేర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గతంలో చిలుకూరు జీపీని అనుబంధంగా ఉన్న అప్పోజీగూడను 2018లో ప్రభుత్వం కొత్త జీపీగా చేసింది. చిలుకూరును మున్సిపాలిటీలో చేర్చడంతో తమ గ్రామాన్ని కూడా చేర్చాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపగా.. అప్పోజీగూడను మున్సిపాలిటీలో చేర్చడానికి అంగీకరించి అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టి పాస్ చేసింది.

మహేశ్వరం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జగన్‌రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కట్టెకొమ్ముల జగన్‌రెడ్డి(స్వతంత్ర జర్నలిస్టు), ప్రధాన కార్యదర్శిగా పుంజాల హేమంత్‌గౌడ్(సాక్షి టీవీ)లను కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంక్షేమం కోసం తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రెస్ అకాడమీ చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా, కార్పొరేట్ పాఠశాలలో ఫీజు రాయితీ కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. విలువలతో కూడిన వార్తాలు రాసి, సమాజాన్ని మేల్కొలిపే విధంగా కృషి చేయాలని సూచించారు. ఇతరులను ఇబ్బంది కలిగించే వార్తలు, పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వత్తుల రఘుపతి, బి.యాదగిరిరెడ్డి, వి.కృష్ణ, కె.రాజ్‌కుమార్, కబీర్, నర్సింహరావు, అభిలాష్, పి.జనార్దన్, నర్సింహ, వెంకటేశ్, భాస్కర్, సాయి, శ్రీనివాస్, ప్రశాంత్, శేఖర్, రాజేశ్, రాజేశ్వరీ పలువురు పాల్గొన్నారు.



కట్టెకొమ్ముల జగన్‌రెడ్డి, అధ్యక్షుడు



హేమంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి

ఏళ్ల కల.. నెరవేరిన వేళ



చేవెళ్లలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కేశంపేట: చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు
- ఆయా గ్రామాల్లో మందకృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎన్నో ఏళ్ల కల అని మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే నెరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్‌మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాల ఎదుట బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగలంతా మందకృష్ణమాదిగకు జీవితకాలం రుణపడి ఉంటారన్నారు. ఇదీ ఎమ్మార్పీఎస్ విజయంగా సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఊరేళ్ల నరేశ్, దామరగిద్ద చందు, గుండాల మల్లేశ్, ఘనాపూరం రాములు, మల్కాపూర్ శాంతికుమార్, అల్లవాడ విజయ్‌కుమార్, గొల్లపల్లి వెంకటేశ్, కందవాడ మహేందర్, నాయకులు సత్యనారాయణ, సత్యనందం, రమేశ్, వరుణ్ తదితరులు ఉన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలుపడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ, మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్య మాదిగ హర్షం వ్యక్తం చేవారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు ముక్క విశ్వంమాదిగ, మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్‌మాదిగ, టీజేఎస్ చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ(ఆర్కే), తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు బాల్‌రాజ్, దయాకర్ మాదిగ, సుదర్శన్‌మాదిగ తదితరులు ఉన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే..

కొందుర్గు: మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ రూపుదాల్చుకుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, సిద్దు, నర్సింలు, చెన్నయ్య, యాదయ్య, రమేశ్, అశోక్, నరేశ్, గణేశ్, రామస్వామి పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం పట్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, గ్యార సురేశ్, గంజాయి దశరథ, మల్లేశ్, మురళీ, హరికుమార్, మల్లయ్య, రాజు, జంగయ్య, సునీల్, మహేశ్, మహేందర్, ప్రదీప్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని రామన్నగూడలో బుధవారం సీపీఐ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తామని చెప్పి అమలు చేయటంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ వందవ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా డిసెంబర్ 26వ తేదీవరకు పార్టీ వారోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. దీంతో గ్రామగ్రామాన సీపీఐ పార్టీ జెండాలను ఆవిష్కరించి ప్రజలకు పోరాటాలను తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మక్బుల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ
- బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. దశాబ్దాల కాలం నుంచి నలుగుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు సీఎం రేవంత్ నాయకత్వంలో కార్యరూపం దాల్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి గౌరవిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి మాదిగల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.శ్రీధర్, ఉపాధ్యక్షుడు వత్తుల నారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెంద్యాల బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కట్టుబడి..

కందుకూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడంతో పాటు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తూ కందుకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కత్తుల వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్ మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనతో ప్రజల్లో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ, మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యుగేందర్‌గౌడ్, ప్రశాంత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అజీజ్, చిర్ర సాయిలు, మోహిన్, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, నర్సింహ, యాదగిరి, ఎం.శేఖర్, కృష్ణ, శ్రీశైలం, బాబు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కందుకూరు చౌరస్తాలో..

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: 42 శాతం బీసీ డిక్లరేషన్, అలాగే ఎస్సీ ఏబీసీ వర్గీకరణ ఆమోదానికి పూర్తి సహకారం అందించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం బడంగ్‌పేట చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మనోహర్, ఎర్ర జైహింద్, గట్టు బాలకృష్ణ, కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, వెంకట్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, శ్రీధర్ ఉన్నారు.

కలెక్టరేట్‌కు తరలిన ఆశలు

కేశంపేట: తమకు ఫిక్స్‌డ్ జీతం చెల్లించాలని కోరుతూ మండల కేంద్రం నుంచి ఆశ కార్యకర్తలు బుధవారం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆశలు మాట్లాడుతూ.. గత కొంత కాలంగా తమకు ఫిక్స్‌డ్ జీతంను చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. తమకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సెలవులతో కూడిన వేతనం అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుజాత, వసంత, పద్మ, జ్యోతి, పర్వీనా, సంతోష, స్వప్న, అనురాధ, గీత, సరస్వతి, కరుణ, సంగీత ఉన్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం తగదు

- ఉనికిని కాపాడుకోవడానికే బీఆర్ఎస్ ఆరోపణలు
- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: కనుమరుగవుతున్న తమ ఉనికిని కాపాడుకోవడం కోసమే బీఆర్ఎస్ నాయకులు, కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన పట్టణంలో బుధవారం పలువురు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయనతో పాటు పలువురు మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులపై మాట్లాడిన మాటలు సరికాదన్నారు. మున్సిపాలిటీ పాలన వ్యవహారంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే ఏ మాత్రం జోక్యం చేసుకోవడం లేదన్నారు. రాజకీయాలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు రోడ్లను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కర్రోళ్ల సురేందర్, శ్రీను, నవీన్‌చారి, నర్సింలు, సత్తయ్య, జనార్దన్‌చారి, విజయపాల్‌రెడ్డి, జగన్, భరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వైద్యారోగ్యశాఖ, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఇటీవల షాద్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహించిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అద్దాలను సరఫరా చేసింది. ఈ అద్దాలను బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని, జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలు అధికంగా చూడటంతో చూపు మందగిస్తుందని, తద్వారా చదువుపై ప్రభావం పడుతుందన్నారు. విద్యార్థులు వెలుతురు ఉండే ప్రదేశాల్లో చదువుకోవాలని సూచించారు. కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించి చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, దీంతో కంటి సమస్యలను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే వైద్యులు రాగిణి, విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, శ్రావణ్‌కుమార్, నర్సింహారెడ్డి, శ్రీనివాసులు, లోకనాథ్, అన్నపూర్ణ, జ్యోతి, సునీత, హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు చెన్నారెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్